

## మే 15న మెడికల్ కాలేజీ ప్రారంభం

- అప్పటిలోగా పనులన్నీ పూర్తిచేసి సిద్ధం చేయండి
- నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్ భవనాల పనుల్లో వేగం పెంచాలి
- మెడికల్ హబ్‌గా 'అందోల్'
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

8 లో

# సన్నబియ్యం పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి

సదాశివపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యంను పంపిణీ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెల్టూర్ గ్రామంలో తెల్లరేషన్‌కార్డుదారులకు సన్న బియ్యంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం దేశంలో కాంగ్రెస్ పార్టీ



సదాశివపేట మండలం వెల్టూర్‌లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి

తెచ్చిన పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా ఉంటాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, తహసీల్దార్ కె.సరస్వతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ సడాకుల కుమార్, వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయబ్ తహసీల్దార్ వీరేశం, మార్కెట్ కమిటీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు వెల్టూర్ ప్రభు, నవీన్, సామెల్, గ్రామ పంచాయితీ కార్యదర్శి అనీల్, మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి

## 17 మంది తహసీల్దార్లకు స్థానచలనం

**సంగారెడ్డి జిల్లాలో భారీగా బదిలీలు**

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 3: సంగారెడ్డి జిల్లాలో 17 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ ముగిసిన వెంటనే బదిలీలు చేపడతారని భావించినా కాస్త ఆలస్యంగా బదిలీలు జరిగాయి.

| తహసీల్దార్ | బదిలీ స్థానం |
|---|---|
| ఉమాశంకర్ | అందోల్ |
| నజీమ్‌ఖాన్ | సిర్గాపూర్ |
| సి.భాస్కర్ | కంగ్టి |
| హసీనాబేగం | నారాయణఖేడ్ |
| విష్ణుసాగర్ | మనూరు |
| యు.శ్రీనివాస్ | మొగుడంపల్లి |
| వెంకటస్వామి | అమీన్‌పూర్ |
| ఎం.పరమేశం | గుమ్మడిదల |
| పి.దశరథ్ | జహీరాబాద్ |
| పి.ఆశాజ్యోతి | కంది |
| బి.అశోక్ | కొండాపూర్ |
| గంగాభవాని | మునిపల్లి |
| ఎస్.రవీందర్ | సీ-సెక్షన్ సూపరింటెండెంట్ |
| విజయలక్ష్మి | హెచ్-సెక్షన్ |
| రసియాసుల్తానా | జి-సెక్షన్ |
| ఆంథోనీ | కలెక్టరేట్ ఏవో |
| విజయ్‌కుమార్ | రాయికోడ్ |

పళ్లెంలోనే అన్నం.. తింటూనే వదిలిన ప్రాణం 7 లో

# ఫ్లైఓవర్‌పై రయ్..రయ్..

సంగారెడ్డి జిల్లాకు ముఖ ద్వారంగా నిలిచే లింగంపల్లి వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చడానికి చేపట్టిన బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే అధికారికంగా ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వాహనాల రాకపోకలకు అనుమతులిచ్చారు. దీంతో, సంగారెడ్డి-హైదరాబాద్‌లో మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తీరాయి. పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే ఉద్యోగులకు ఉపశమనం లభించింది.

-రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)





# వివాహేతర బంధం.. యమపాశం

- అడ్డుతొలగించుకోవాలని హత్య.. జీవితమంతా జైలుపాలు
- సంగారెడ్డి జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర ఘటనలు
- పతనమవుతున్న నైతిక విలువలు
- పోలీసు శాఖ తరఫున అవగాహన అవసరం

7 లో

వివాహేతర సంబంధాలే యమపాశాలవుతున్నాయి.. కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. కట్టుకున్నవారిని అడ్డు తొలగించుకొనేందుకు హత్యలకు పాల్పడి జీవితమంతా జైలుపాలు చేసుకుంటున్నారు. అభం శుభం తెలియని చిన్నారులు సమిధలవుతున్నారు. శాంతిభద్రతలకు సవాలుగా మారుతున్న ఇటువంటి ఘటనలు ఇటీవల సంగారెడ్డి జిల్లాలో సంచలనంగా మారాయి. ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.





## పేరుకే పోలీస్ అవుట్‌పోస్ట్!

**సంగారెడ్డి జీజీహెచ్‌లో భద్రత ప్రశ్నార్థకం**

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్ అలంకారప్రాయంగా మారింది. రెండేళ్ల కిందట పోలీస్ ఔట్ పోస్ట్‌ను ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో పోలీసు సిబ్బందిని నియమించలేదు. ఆస్పత్రిలో అన్ని కేడర్ల ఉద్యోగులు వెయ్యి మంది వరకు పనిచేస్తుండగా, నిత్యం 1,500 మంది వరకు ఓపీ, ఐపీ సేవలు పొందుతున్నారు. ఆస్పత్రిలో చోరీలు, చిన్నారుల కిడ్నాప్‌లు, సిబ్బందిపై బాధితుల దాడుల ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. పోలీస్ అవుట్ పోస్టు ఉంటే తక్షణం స్పందించే వీలు ఉంటుంది. కానీ, పోలీస్ అవుట్‌పోస్ట్‌లో సిబ్బంది లేక అలంకారప్రాయంగా మారింది. కొత్త ఎస్పీ స్పందించి అవుట్ పోస్ట్‌లో పోలీసు సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

# పేదలకూ పెద్దల బియ్యం

**..ఇదే ప్రభుత్వ సంకల్పం**

- అర్హులందరికీ రేషన్ కార్డులు
- వచ్చే నెలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్

జోగిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ధనవంతులు తినే సన్నబియ్యాన్నే పేదలకూ అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని, అందుకే రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలో గురువారం ఆయన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం చరిత్రాత్మకమని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.85 కోట్ల మంది లబ్ధిపొందుతారని పేర్కొన్నారు. త్వరలోనే అర్హులందరికీ రేషన్‌కార్డులను అందజేస్తామని తెలిపారు. వచ్చే నెలలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని వెల్లడించారు. రాజకీయాలకు ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు. అందోలు నియోజకవర్గాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో 846 రేషన్ షాపుల పరిధిలో 12,32,274 మంది లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రితో పలువురు మహిళలు తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఒకరు, కౌన్సిలర్ కనిపించడం లేదంటూ మరొకరు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, సవిల్‌సప్లై డీఎం అంబదాస్ రాజేశ్వర్‌రావు, డీఎస్వో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో పాండు, తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి, కమిషనర్ తిరుపతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, నరేందర్‌రెడ్డి, శివరాజ్ యాదవ్, సురేందర్‌గౌడ్, ప్రవీణ్, చిట్టిబాబు, సురేశ్, ప్రదీప్‌గౌడ్, వెంకటేశం, చందర్, లక్ష్మణ్, రాజిరెడ్డి, మల్లప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

### పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

సంగారెడ్డి అర్బన్ : పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా పోతిరెడ్డిపల్లిలోని దొడ్డికొమురయ్య విగ్రహానికి కలెక్టర్ క్రాంతితో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యాశాఖలోని సమగ్ర శిక్ష కింద పనిచేస్తున్న ఐఈఆర్‌పీలను రెగ్యులరైజ్ చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.



వాటర్‌షెడ్ పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న చిన్నారెడ్డి

# నీటి సంరక్షణతో జల సంపద

**రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి**

**గొటిగర్‌పల్లిలో వాటర్‌షెడ్ పనుల పరిశీలన**

కోహీర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కురిసిన వర్షం నీటిని ఎక్కడికక్కడే సంరక్షించుకున్నప్పుడే జల సంపద సాధ్యపడుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి గ్రామంలో 2001-2002లో చేపట్టిన వాటర్‌షెడ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. గ్రామ మాజీ సర్పంచ్ రాచయ్యను, రైతులను ప్రశంసించారు. రైతులు కేవలం పంటల సాగులోనే కాకుండా పాడి సంపదను కూడా పెంచుకోవాలన్నారు. పాడి, పంటలతో రైతు బాగుపడినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఉద్యానవన పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలను సాగు చేయాలన్నారు. గొటిగర్‌పల్లి రైతులకు ప్రభుత్వపరంగా సహాయ సహకారం అందించేందుకు కృషిచేస్తానన్నారు. నీటి సంరక్షణ కోసం రైతులతతోపాటు అధికారులు కూడా అంకితభావంతో పనిచేయాలన్నారు. ఇరిగేషన్ శాఖలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని, అధికారుల తీరుతో రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ జ్యోతి, ఆర్డీవో రామ్‌రెడ్డి, తహసీల్దార్ బాలశంకర్, ఎంపీడీవో భారతి, ఆర్ఐ సత్యనారాయణ, అఫ్సర్, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



జిన్నారం మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

# ఎండల్లో హాయ్.. హాయ్..

- మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురిసిన వర్షం
- ఎండ నుంచి ఉపశమనం.. పంటలకు ఊరట
- పలుచోట్ల విరిగిన చెట్లు, స్తంభాలు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

తూప్రాన్/రామాయంపేట/శివ్వంపేట/నర్సాపూర్/సంగారెడ్డి అర్బన్/సదాశివపేట/పుల్‌కల్/జిన్నారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం అకాల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డితోపాటు జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించింది. భూగర్భ జలాలు అడుగంటి వరి ఎండిపోతున్న తరుణంలో వర్షం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్ మండలంలో గాలివానకు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కరెంటు వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు గంటల తరబడి అంతరాయం కలిగింది. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులో వ్యవసాయ క్షేత్రాల్లో స్తంభాలు విరిగిపోయాయి. అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ వైరు తెగిపోయి సరఫరా నిలిచిపోయింది. రామాయంపేటలో గురువారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జలమలమయ్యాయి. మురుగుకాల్వలు నిండిపోయి వీధులను ముంచెత్తాయి. మండల కేంద్రమైన శివ్వంపేటలో గంటపాటు వర్షం కురిసింది. మండల పరిధిలోని టిక్యదేవమ్మ గూడెం ప్రాథమిక పాఠశాల వద్ద రోడ్డుపై చెట్టుకొమ్మ విరిగిపడింది. నర్సాపూర్ మండలంలోని కొండాపూర్-నత్నయపల్లి-కాగజ్ మద్దూర్ రోడ్డుపై కల్వర్టుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అల్లాదుర్గం మండలంలో వర్షానికి పలుచోట్ల వరి పంటకు మేలు జరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డితో పాటు సదాశివపేట, నారాయణఖేడ్, అందోలు-జోగిపేట, జిన్నారం, పటాన్‌చెరు, రాంచంద్రాపురం తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. సదాశివపేట మండలం ఇబ్రహీంబాద్‌లో పిడుగుపాటుకు గ్రామానికి చెందిన బలరాం లచ్చయ్యకు చెందిన 20 మేకలు మృతి చెందాయి. ఉమ్మడి పుల్కల్ మండలంలో వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సరఫరా నిలిచిపోయింది.



సంగారెడ్డిలో కురుస్తున్న వర్షం



7 లో

## సమాజ శ్రేయస్సు కోసం కృత్రిమ మేధ

- గీతంలో అంతర్జాతీయ సదస్సులో పిలుపునిచ్చిన వక్తలు
- ప్రారంభమైన 'గ్రీన్ ఏఐ-2025'

# అనుమానాస్పద స్థితిలో వృద్ధ దంపతులు మృతి

నంగునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వృద్ధ దంపతులు మృతి చెందిన సంఘటన నంగునూరులో గురువారం తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ సంఘటనలో ఇందుకు సంబంధించి గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. నంగునూరు గ్రామానికి చెందిన నంగునూరుకు చెందిన ఆవుల కొమురయ్య (80), భూదవ్వ (75) భార్యభర్తలు. భూదవ్వకు మంత్రాలు వస్తాయనే నెపంతో ఇంటి చుట్టుపక్కల వాళ్ల వేధింపులకు గురిచేయడంతో భరించలేక వ్యవసాయ బావి వద్ద ఉంటూ జీవిస్తున్నారు. వారి కుమారుడు పరుశరాములు ప్రతిరోజూ భోజనం తెచ్చి ఇస్తుంటాడు. ప్రతిరోజు ఉదయం లేవగానే వ్యవసాయ పొలం చుట్టూ తండ్రి కొమురయ్య తిరుగుతూ వ్యవసాయ పనులు చూసేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన వృద్ధ దంపతుల కుమారుడు పరుశరాములకు అమ్మానాన్న కనిపించకపోవడంతో వారు ఉండే రూమ్ దగ్గర వెళ్లి చూడగా లోపల నుంచి తలుపు గడియ పెట్టుకొని ఉన్నారు. ఎంతకు పిలిచినా లేవకపోవడంతో సమీపంలోని రైతుల సహాయంతో డోర్‌ను పగలగొట్టి చూడగా విగతజీవులై కనిపించారు. భార్య భర్తలు ఒకేసారి చనిపోవడంతో విషయాన్ని రాజగోపాల్‌పేట పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. సిద్దిపేట ఏసీపీ మధు, రూరల్ సీఐ శ్రీను, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసిఫ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు జాగిలాలతో చుట్టుపక్కల గాలించారు. ఎలాంటి ఆనవాళ్లు దొరకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధ దంపతుల మృతిపై పలువురు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరన్న విష ప్రయోగం చేశారా, లేక వారే ఏమైనా తీసుకొని మరణించారా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వృద్ధ దంపతుల మృతిపై విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.భార్యాభర్తలు ఒకేసారి మృతి చెందడంతో ఎవరికైనా అనుమానం వస్తుందని అదే కోణంలో పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా పరిశోధన నిర్వహిస్తామని ఏసిపి మధు తెలిపారు. వృద్ధ దంపతులకు కుమారుడు పరశురాములు, కోడలు పావని, ఇద్దరు కుమార్తెలు రేణుక, నాగవ్వ ఉన్నారు.



కొమురయ్య, భూదవ్వ (ఫైల్)

## బ్రహ్మోత్సవాలకు ఇందుప్రియాల్ సీతారామచంద్రస్వామి ఆలయం ముస్తాబు



ఇందుప్రియాల్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం

దౌల్తాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి 11 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త అన్నారెడ్డి సుభాష్‌రెడ్డి తెలిపారు. 10న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## నేటి నుంచి తూప్రాన్ రామాలయ బ్రహ్మోత్సవాలు

తూప్రాన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని పురాతన రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయంలో ఈనెల 4న శుక్రవారం నుంచి 13న ఆదివారం వరకు 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బజారు రవీంద్ర తెలిపారు. 13న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.



తూప్రాన్ రామాలయం

క్రైం కార్నర్

## అన్నం.. తింటూనే వదిలిన ప్రాణం

● సిద్దిపేట జిల్లా హబ్షీపూర్‌లో విషాదం


భాగ్యమ్మ(ఫైల్)

సిద్దిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పెట్టుకున్న అన్నం పళ్లెంలోనే ఉంది.. రెండు బుక్కలు కూడా తినలేదు.. ఎంగిలి చేతుతోనే గోడకు అచేతనంగా ఒరిగి, ప్రాణాలొదిలిన సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో గురువారం విషాదంను నింపింది. గ్రామానికి చెందిన కుక్కడగల భాగ్యమ్మ(42) వ్యవసాయ కూలీగా పని చేస్తుంది. ఆమె భర్త రమేష్ 18 ఏళ్ల క్రితం మరణించాడు. వారికి ఇద్దరు కుమారులు సురేష్, స్వామి ఉండగా వారు సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. ఒంటరిగానే గ్రామంలో ఉంటున్న భాగ్యమ్మను బుధవారం రాత్రి అదే గ్రామంలో హోటల్‌లో పని చేస్తున్న ఆమె తమ్ముడు పరమేశ్వర్ వచ్చి పలకరించారు. రాత్రి తిని పడుకోవాలని సూచించి వెళ్లిపోయాడు. పరమేశ్వర్ గురువారం ఉదయం వచ్చి చూసే సరికి అక్క అన్నం పళ్లెంను ముందు పెట్టుకుని, ఎంగిలి చేతుతోనే గోడకు ఒరిగి అచేతనంగా పడి ఉంది. వెంటనే స్థానికులు ఆమెను చూసేసరికి ప్రాణాలొదిలినట్టుగా తేలింది. దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

మునిపల్లి , ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన బుదేరా చౌరస్తాలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికలు, పోలీసులు వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం బుదేరా గ్రామానికి చెందిన వనంపల్లి రమేష్(45) మోటారుసైకిల్‌పై బుదేరా చౌరస్తాలోని ఓ హోటల్‌లో గురువారం రాత్రి టీ తాగేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఫ్లైఓవర్ (సర్వీస్) రోడ్డు వద్దకు రాగానే సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న క్వాలిస్ వాహనం మోటారుసైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. రమేష్‌కి బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. కాగా, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరుబుదేరా, గొర్రెగట్టు గ్రామాలకు చెందిన వారుగా తెలుస్తోంది.

### కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


నరేశ్(ఫైల్)

పాపన్నపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పాపన్నపేట మండల పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని నార్సింగి గ్రామానికి చెందిన నరేష్ కుమార్(26)కు తన భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన నరేష్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వాళ్లు గమనించి నరేశ్ కుంటుంబానికి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

### సెంట్రింగ్ పని చేస్తూ జారి పడి మేస్త్రీ మృతి


బాగేలే మృతదేహం

చేగుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి మేస్త్రీ మృతిచెందిన సంఘటన చేగుంట మండలం పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మ జిల్లా కోద్రిపాల్ గ్రామానికి చెందిన బూంది బాగేలే(40) చేగుంట మండలంలోని చిట్టోజీపల్లి గ్రామం జీటెక్ పరిశ్రమలో భవన నిర్మాణంలో సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. బుధవారం పనిలో ఉండగా ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి వారు వెంటనే నర్సింగ్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. బూంది బాగేలే కుమారుడు విజయ్ బాగేలే ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం పంపించారు.

### అదృశ్యమైన మహిళ.. కుళ్లిన స్థితిలో శవమై లభ్యం


బుజిలీ(ఫైల్)

నర్సాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పది రోజుల క్రితం అదృశ్యమైన మహిళ నర్సాపూర్-మెదక్ రహదారి పక్కన కాలువలో కుళ్లిపోయిన శవంగా కనిపించిన ఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన బుజిలీ(52) గత నెల 25వ తేదీన నర్సాపూర్ ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టపక్కల, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికగా, ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం నర్సాపూర్-మెదక్ రహదారి పక్కన అటవీశాఖ తవ్వించిన కాలువలో కుళ్లిన స్థితిలో శవమై కనిపించింది. మృతుదేహంపై చీర, నగలు, ఇతర ఆనవాలు గుర్తించి బుజిలీగా నిర్ధారించారు. దర్యాప్తు అనంతరం పూర్తివివరాలు తెలియజేస్తామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

### ఎండు గంజాయి, నాటు తుపాకీ స్వాధీనం

జిన్నారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం దోమడుగులో ఓ వ్యక్తి వద్ద కేజీ ఎండు గంజాయి, ఒక నాటు తుపాకీని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఉపేందర్ దోమడుగులో ఉండే తన నివాసంలో గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కేజీ ఎండు గంజాయి, ఒక నాటు తుపాకీ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది.

### ఘనంగా గోకులాశ్రమం బ్రహ్మోత్సవాలు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మానవులందరికీ ధర్మాచరణ ఆరోగ్య ఆహార విధానం తోటి ప్రాణుల సంరక్షణ మొదలైన విషయాలపై అవగాహన కల్పించడం కొరకు వశిష్టపరంపర ఆధ్యాత్మిక ట్రస్టు కృషి చేస్తుందని ట్రస్టు వ్యవస్థాపక సభ్యుడు మాత సరళాదేవి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలో గోకులాశ్రమం స్థాపించి 15 సంవత్సరాలు నిండిన సందర్భంగా గురువారం బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ ఇప్పటివరకు 300 మంది శిష్యులకు గోకుల ఆశ్రమంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆశ్రమంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గోకులాశ్రమ వ్యవస్థాపకులు మధుసూదనార్యులు, ఆధ్యాత్మిక గురువులు సత్యజిత్, ఆస్ట్రాలజిస్ట్ ఎన్వీఎస్ రాజా, ట్రస్టు సభ్యులు మోహనయ్య తదితరులు పాల్గొన్నారు.

### మా భూమి రథయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో ఏప్రిల్ 14న ప్రారంభమయ్యే లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీల ఆధ్వర్యంలో ఏప్రిల్ నిర్వహించే ఈ రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం సిద్దిపేటలో ఆవిష్కరించి మాట్లాడారు. విశారదన్ మహారాజు చేపట్టిన ఈ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీ అణగారిన వర్గాల ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని కలిగించి రాజ్యాధికారాన్ని స్థాపించడమే ధ్యేయంగా ధర్మ సమాజ్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జ్యోతి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## వివాహేతర బంధం.. యమపాశం



ముగ్గురు పిల్లలను తల్లే టవల్‌తో గట్టిగా అదిమి ఊపిరాడకుండా చంపిన దిగ్భ్రాంతికర ఘటన పోలీసుల విచారణలో రెండురోజుల క్రితం వెలుగుచూసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడలో ఉంటున్న మహిళ ప్రియుడి మోజులో కళ్లుమూసుకుపోయి.. అతడితో తన పెళ్లికి పిల్లలే అడ్డుగా ఉన్నారని.. పేగు తెంచుకుని పుట్టారన్న మమకారాన్ని మర్చిపోయింది. గత నెల 27వ తేదీన ముగ్గురు పిల్లలను నిర్దాక్షిణ్యంగా కడతేర్చడం సంచలనం రేపింది.

సదాశివపేట మండలంలోని నందికంది గ్రామానికి చెందిన 39 ఏళ్ల మహిళతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి(45) వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెపై మోజు తీరాక ఆమె కూతురుపై కన్నేసాడు. ఈ విషయాన్ని ఆమె గ్రామస్థులకు చెబుతానని బెదిరించింది. దీంతో ఆగ్రహానికి గురైన వ్యక్తి ఫిబ్రవరి 27న మహిళను బండరాయితో తలపై కొట్టి దారుణంగా హత్య చేసి కటకటాల పాలయ్యాడు.

సోషల్ వేల్ఫేర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మహిళ సంగారెడ్డిలోని ఓ జిమ్‌లో శిక్షకుడిగా పనిచేస్తున్న వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నది. ఈ విషయం తెలిసిన భర్త తమ బంధానికి అడ్డుపడుతున్నాడని ప్రియుడు, ఓ కానిస్టేబుల్‌తో కలిసి ఫిబ్రవరి 20న హత్యకు పాల్పడింది. తీవ్రంగా గాయపడిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఎనిమిది రోజుల తరువాత ప్రాణాలొదిలాడు. దీనికి కారణమైన భార్య, ప్రియుడు, కానిస్టేబుల్ ఊసలు లెక్కిస్తున్నారు.

కంగ్టి మండలం తుర్కవడగాం గ్రామానికి చెందిన వ్యక్తి(55)కి ముప్పై ఏళ్ల క్రితం వివాహమైంది. అతడికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె వివాహం కాగా, ముగ్గురు చదువుకుంటున్నారు. కొన్ని రోజులుగా భార్యపై అనుమానం పెంచుకున్న సదరు వ్యక్తి ఫిబ్రవరి 18వ తేదీన మద్యం మత్తులో గొడ్డలితో దాడి చేసి చంపేశాడు. అతడు జైలుపాలు కావడంతో పిల్లల బతుకు అగమ్యగోచరమైంది.

నిజాంపేట మండలం నాగ్‌దర్‌రాంచెందర్ తండాకు చెందిన యువకుడు(30) పెళ్లి కాగా, సంగారెడ్డిలోని ఓ పరిశ్రమలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నారాయణఖేడ్ మండలం మేఘ్యానాయక్ తండాకు చెందిన వ్యక్తి సదరు యువకుడు తన కూతురితో సన్నిహితంగా ఉంటున్నాడని ఫిబ్రవరి 12న హత్య చేశాడు. మృతదేహాన్ని ముక్కలుముక్కలుగా చేసి నిజాంపేట మండలం ఈదుల్‌తండా గుట్టల్లో పడేశాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. దీంతో మృతుడి భార్య, పిల్లలు, నిందితుడి భార్య, పిల్లలకు కుటుంబపెద్ద లేకుండా పోయారు.

**అడ్డుతొలగించుకోవాలని హత్య**
**జీవితమంతా జైలుపాలు**
**ఇటీవల చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర ఘటనలు**
**పతనమవుతున్న నైతిక విలువలు**
**పోలీసు శాఖ తరఫున అవగాహన అవసరం**

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధాలు మనిషిలోని మానవత్వాన్ని చంపేస్తున్నాయి. పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి. మూడుముళ్ల బంధాన్ని కాలరాస్తున్నాయి. పరాయి వారి మోజులో పడి అటు భర్తలు, ఇటు భార్యలు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆ కారణంగా తమ వారినే అడ్డు తొలగించుకొనేందుకు చివరకు హత్యలకు పూనుకుంటున్నారు. దీంతో నడి వయస్సులోనే తమ జీవితాలను జైలుపాలు చేసుకుంటున్న వారు కొందరైతే, 20,30 ఏళ్ల పాటు కాపురం చేసి అనుమానమనే పెను భూతంతో జీవితాలను నాశనం చేసుకుంటున్న వారు మరికొందరు. కుటుంబంలో ఒకరు హతమవడం, మరొకరు జైలుకెళ్లడంతో వారి పిల్లలు అనాథలవుతున్నారు. గత బంధాన్ని అడ్డుతొలగించుకునే ప్రయత్నంలో అభంశుభం తెలియని చిన్నారులను సైతం బలిగొంటున్న దారుణ ఘటనలు కలిచివేస్తున్నాయి. సమాజంలో నైతిక విలవల పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

#### కుటుంబాలు కకావికలం

వివాహేతర సంబంధాల కారణంగా జరుగుతున్న హత్యలతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. మానవత్వం మరిచి భాగస్వాములనే కడతేర్చడంతో బాధిత కుటుంబీకులు కకావికలమవుతున్నాయి. కుటుంబంలో ఒకరు నేరం చేస్తే మిగిలి వారందరికీ సమాజంలో ఒక రకమైన చెడుబావన కలుగుతోంది. వారిని దగ్గరకు రానివ్వడం లేదు. వారి కులాల్లో బంధువులు సైతం ఏ శుభకార్యానికి పిలవడం లేదు. నేరం తర్వాత కుటుంబం రోడ్డున పడటం జరుగుతోంది.

#### అవగాహన కార్యక్రమాలు అవసరం

గతంలో మూఢనమ్మకాల నెపంతో నిరక్షరాస్యత కారణంగా హత్యలు చోటుచేసుకొనేవి. ప్రస్తుత హైటెక్ యుగంలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులైనప్పటికీ నేరాలు మాత్రం అదేస్థాయిలో పెరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాలు ప్రభావం తీవ్రంగా చూపుతోంది. ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో మంచి కంటే ఎక్కువగా చెడు విషయాలకే బానిసలవుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లలో చాటింగ్‌లు వివాహేతర బంధాలకు తీరి తీస్తున్నాయి. విషయం కుటుంబంలో తెలియడంతో అయిన వారినే హతమార్చేందుకు సైతం వెనుకాడటం లేదు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ తరఫున అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. మరొకరి మోజులో పడి కుటుంబీకులను కడతేరిస్తే ఆ తర్వాత జీవితం జైలుపాలు కావడంతో పాటు మిగిలిన కుటుంబీకుల పరిస్థితి దైన్యంగా వుంటుందన్న విషయాలను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

#### క్షణికావేశంలోనే హత్యలు



క్షణికావేశంలోనే కొందరు హత్యలకు పాల్పడుతున్నారు. వివాహేతర సంబంధాలు చివరకు విషాదంగానే ముగుస్తాయన్న విషయాన్ని గుర్తించాలి. వివాహేతర సంబంధాల కారణంగా జరుగుతున్న హత్యలతో కుటుంబాలు చితికిపోతున్నాయి. చిన్నారులు అనాథలవుతున్నారు. పెద్దవారు రోడ్డున పడుతున్నారు. ఒత్తిడి, క్షణికావేశం కారణంగా అఘాయిత్యాలకు పాల్పడటం, లేదా హత్యలు చేయడం జరుగుతోంది. దీంతో నిండు జీవితం జైలు పాలవుతుంది. ఈ విషయాన్ని గుర్తించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. హత్యానేరాలు చేయడం వల్ల కుటుంబాల్లో చోటు చేసుకొనే పరిస్థితులను వివరిస్తూ జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

## మున్సిపాలిటీలకు అవార్డులు

● పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని సాధించిన బల్దియా కమిషనర్లకు అభినందన
● అవార్డును అందజేసిన సీడీఎంఏ శ్రీదేవి




ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, సిద్దిపేట కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

నారాయణఖేడ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూలులో లక్ష్యాన్ని అధిగమించినందుకు నారాయణఖేడ్ మున్సిపాలిటీకి ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో ఈ అవార్డును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరక్టర్(సీడీఎంఏ) శ్రీదేవి అందించారు. ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి నారాయణఖేడ్ మున్సిపాలిటీ 2023-2024, 2024-2025 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి పన్నులను వసూలు చేసినందుకు ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపిక చేశారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో రూ.2.62 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా, 2023-2024 సంవత్సరంలో 85 శాతం, 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 86.55 శాతం వసూలు చేశారు. దీంతో ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపిక చేసి, అవార్డు అందించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది సమిష్టిగా పనిచేయడం, పట్టణ ప్రజలు సహకరంతోనే ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైందన్నారు.

#### వెల్‌డన్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్‌కు ఆదాయవనరులు పెంచడంతో పాటు 2024-2025 గాను రాష్ట్రంలో 84.15 శాతం పన్ను వసూలు చేసినందుకు గురువారం హైదరాబాద్‌లో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను సీడీఎంఏ శ్రీదేవి వెల్‌డన్ అంటూ అభినందిస్తూ, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజల సహకారంతో పన్ను వసూలు చేయగలిగామని, సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్ని రంగాల్లో సిద్దిపేట పట్టణాన్ని ముందంజలో ఉంచుటకు కృషి చేస్తామన్నారు.

#### తూప్రాన్ మున్సిపాలిటీకి..

తూప్రాన్ (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మున్సిపాలిటీ 2024-25లో 82.17శాతం పన్ను వసూళ్లను చేపట్టారు. దీంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరక్టర్ శ్రీదేవి చేతుల మీదగా కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన మేనేజర్ రఘువరన్, సిబ్బందిని అభినందించారు.

#### జోగిపేట మున్సిపాలిటీకి ప్రశంసాపత్రం



జోగిపేట, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతికి అరుదైన ప్రశంస లభించింది. ఈఏడాది 75 % పైగా పన్నులు వసూలు చేపట్టడం పట్ల, పురపాలక శాఖ సీడీఎంఏ శ్రీదేవి గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తిరుపతిని అభినందించింది ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ అందరి ఉద్యోగుల కృషి, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించడంతోనే ఉత్తమంగా నిలిచామని తెలిపారు.

## సమాజ శ్రేయస్సుకు కృత్రిమ మేధ

● గీతం అంతర్జాతీయ గ్రీన్ ఏఐ-2025 సదస్సులో పిలుపునిచ్చిన వక్తలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సామాజిక శ్రేయస్సు కోసం కృత్రిమ మేధను ఉపయోగించుకోవడానికి ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతర్జాతీయ సహకారం అవసరమని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'గ్రీన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇండస్ట్రియల్ అప్లికేషన్స్' (గ్రీన్ ఏఐ-2025) అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయ ఎమెరిటస్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ పూజారి, ఒడిశాలోని ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సచ్చిదానంద దేహూరి వంటి విద్యావేత్తలు ఈ సదస్సుకు శ్రీకారం చుట్టారు. సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ అరుణ్ 'ఇంటర్ ప్రెటబుల్ క్లస్టరింగ్'పై లోతైన అవగాహన కల్పించేలా కీలకోపన్యాసం చేశారు. గ్రీన్ ఏఐ అభివృద్ధి చెందుతున్న రంగమని, ఇటువంటి ట్రెడింగ్ రంగంపై గీతం అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. ఈ సదస్సు ఏఐ, అధిక - పనితీరుగల కంప్యూటింగ్‌లో కొత్త పరిశోధనా మార్గాలు, వినూత్న అంశాలతో స్ఫూర్తిస్తుందని ప్రొఫెసర్ అరుణ్ ఆశాభావం వ్యక్తపరిచారు. దక్షిణ కొరియాలోని యోన్సే విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సంగ్- బేచో వర్చువల్‌గా 'డీప్ లెర్నింగ్‌పై ఇటీవలి వినూత్న రచనలు: సాఫ్ట్ కంప్యూటింగ్ ల్యాబ్ యొక్క దృక్పథాలు' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ప్రొఫెసర్ సచ్చిదానంద దేహూరి 'మెషిన్ లెర్నింగ్‌లో పరేటో ఫ్రంట్‌ను వెలికితీయడం'పై ఉపన్యసిస్తూ, ఏఐ-ఆధారిత పరిష్కారాలలో ఆప్టిమైజేషన్ పద్ధతులపై విలువైన సమాచారాన్ని తెలిపారు.

## ఆఫ్‌లైన్‌లోనూ 'యువ వికాసం' దరఖాస్తుల స్వీకరణ

● ఎంపీడీవో, మున్సిపాలిటీలలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
● రేషన్ కార్డు ఉంటే.. ఆదాయ ధ్రువీకరణ పత్రం లేకున్నా దరఖాస్తుకు అవకాశం
● ఈనెల 14 వరకు గడువు


చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న సిబ్బంది

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులు ఇప్పటి వరకు కేవలం మీసేవ కేంద్రాల్లోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించగా తాజాగా ఆఫ్‌లైన్‌లోనూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. అన్ని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో అధికారులు స్వీకరిస్తున్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఈబీసీ(ఈడబ్ల్యూఎస్) కులాలకు చెందిన నిరుద్యోగ యువత ఆయా కేంద్రాలను సంప్రదించి మ్యానువల్‌గానూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా కేంద్రాల్లో అందించిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలో సిబ్బంది ఆన్‌లైన్ చేయనున్నారు. ఇది వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించగా.. ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అంతేకాకండా దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 14 వరకు పొడిగించారు.

#### ఆదాయ ధ్రువపత్రం లేకున్నా అవకాశం

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలంటే తహసీల్దార్లు జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణపత్రం తప్పనిసరని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో వాటి కోసం రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. దీంతో సర్వర్‌లో టెక్నికల్ సమస్యలు తలెత్తి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. రేషన్‌కార్డు కలిగిన వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం లేకున్నా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారు. అయితే రేషన్‌కార్డు లేనటువంటి వారు మాత్రం తప్పనిసరిగా తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

#### ఈ పత్రాలు తప్పనిసరి

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఏ విధానంలోనైనా ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే తప్పనిసరిగా ఆధార్, పాన్‌కార్డు, కుల, ఆదాయ, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లను జత చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు తమ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలను దానికి జత చేసి సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి అందజేస్తే సరిపోతుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని వారి కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని ఆదాయం రూ.2లక్షలలోపు ఉన్నవారు మాత్రమే ఈ పథకం దరఖాస్తుకు అర్హులు. అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు కోరారు.

### భవిష్యత్ తరాల మనుగడకు పర్యావరణ పరిరక్షణ చేపట్టాలి

పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణ భవిష్యత్తు తరాల మనుగడకు ఎంతో అవసరమని ప్రముఖ పర్యావరణ వేత్త రిటైర్డ్ ప్రొఫెసర్ కె.పురుషోత్తం తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఐక్యూఏసీ, రాజనీతిశాస్త్ర, జువాలాజీ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత ప్రముఖ పర్యావరణ వేత్త ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని సుస్థిరమైన పర్యావరణ విధానాలను పాటిస్తూ సహజ వనరులు, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం సూచించారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సి.సుబ్రహ్మణ్యం పునరుత్పాదక ఇంధన వనరులు (గ్రీన్ ఎనర్జీ) వాటి వినియోగంలో వస్తున్న నూతన సాంకేతికత ఆవశ్యకతలను సమగ్రంగా వివరించారు. హరయోగ (ఎన్‌జీవో) వ్యవస్థాపకుడు సామ ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాల ఆవశ్యకతను వివరించారు. వివిధ రాష్ట్రాలనుండి 150 వరకు పరిశోధన పత్రాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, సదస్సు కన్వీనర్లు హరిబాబు, పి. అయోధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### పదో తరగతి ఒకేషనల్ పరీక్ష ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పదో తరగతి ఒకేషనల్ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. 18 పరీక్షా కేంద్రాల్లో 2028 మందికి 2018 మంది హాజరుకాగా, 10 మంది గైర్హాజరయ్యారు. 99.51 హాజరు శాతం నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో 12.5ఎంవీఏ పీటీఆర్ ఏర్పాటు చేయడంతో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉస్మాన్‌నగర్, కొల్లూరు డబుల్‌బెడ్‌రూం, బీమాక్‌సొసైటీ, తెల్లాపూర్ వ్యవసాయ ప్రాంతం, రాజ్‌పుష్ప నుంచి ఎలియన్స్ అపార్ట్‌మెంట్స్ వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చెప్పారు.

### 'ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి'

కంగ్టి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యమందించేందుకు ఆర్ఎంపీలు కృషి చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కంగ్టిలో వైద్యులు చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు.

### మాదిగ వర్గానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలి

కంగ్టి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మాదిగ వర్గానికి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు లాల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన తడ్కల్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఖేడ్ నియోజకవర్గంలో మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప పదవులు దక్కనివ్వడం లేదని ఆరోపించారు.

### సమస్యలు పరిష్కరించాలని చైర్మన్‌కు వినతి

జహీరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఉపాధిహామీ సిబ్బంది కోరారు. గురువారం రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు చైర్మన్ చిన్నారెడ్డి జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు.

### విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాయికోడ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య అన్నారు. గురువారం రాయికోడ్ మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో గల గురుకుల బాలికల పాఠశాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా క్లాస్‌రూంలో విద్యార్థులతో మాట్లాడి, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీ నర్సింలు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ గ్రీవెన్స్ డే

అల్లాదుర్గం, ఏప్రిల్ 3. (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలపై 4న జిల్లా కేంద్రమైన మెదక్‌లో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో అల్లాదుర్గం ఇన్‌చార్జి ఏఈ నవాజ్ తెలిపారు. మెదక్ విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించే ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే వ్యవసాయ రంగానికి సరఫరా చేస్తున్న విద్యుత్ సమయాన్ని మార్చడం జరిగిందని వ్యవసాయ రంగానికి రాత్రి 11-30 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 5 గంట లవరకు త్రీఫేజ్ కరెంటు సరఫరా అవుతుందన్నారు.

### బండ్ల ఊరేగింపు

చిలప్‌చెడ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో గురువారం నల్ల పోచమ్మజాతరలో బండ్ల ఊరేగింపు కనుల పండువగా సాగింది. జాతరలో రెండవరోజైన గురువారం గ్రామానికి చెందిన బండ్ల తోపాటు ఇతర గ్రామాలకు చెందిన భక్తులు కూడా బండ్లు కట్టారు. బండ్లతో పాటు ట్రాక్టర్‌లను కూడా తిప్పడంతో సందడి మరింత నెలకొంది,

### వేతనాలు చెల్లించాలి

మనోహరాబాద్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నెలలు గడుస్తున్నా తమకు వేతనాలు రావడం లేదని జీపీ కార్మికులు గురువారం మనోహరాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం జడ్పీ సీఈవో ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు.

### ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

మనోహరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. వాటికి సంబంధించిన కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలను, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ మెదలైనవి ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఎంపీడీవో కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు.

# మే 15న మెడికల్ కాలేజీ ప్రారంభం

- అప్పటిలోగా పనులన్నీ పూర్తిచేసి సిద్ధం చేయండి
- నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్ భవనాల పనుల్లో వేగం పెంచాలి
- మెడికల్ హబ్‌గా 'అందోల్'
- మంత్రి దామోదర్ రాజనర్సింహ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, పక్కన సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి అర్బన్/రేగోడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలను వచ్చేనెల 15న ప్రారంభించుకుందామని, అప్పటిలోగా పనులన్నీ పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిర్మాణ పనులపై గురువారం రాత్రి కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంగారెడ్డి, అందోల్‌లో నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీ భవనాలు, హాస్టల్స్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. అందోల్‌ను మెడికల్ హబ్‌గా రూపొందించడంలో భాగంగా వట్‌పల్లి, కంకోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేసి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులలో ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి స్పష్టం చేశారు. కాగా జిల్లాలోని ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు తమ ఆస్పత్రులకు కావాల్సిన వైద్య పరికరాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, డీసీహెచ్‌వో డా.సంగారెడ్డి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్స్, టీవీవీపీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ఆర్అండ్‌బీ, టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే రేగోడు హనుమాన్ మందిర్ పునర్నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠాపనకు రావాలని రేగోడు మాజీ పీఏసీఎస్ చైర్మన్లు శ్యామ్‌రావు, రాధాకిషన్‌గుప్తా, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్, రమేష్‌గుప్తా తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు అన్యాయం

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్


ప్రభాకర్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత మైనార్టీలకు అన్యాయం చేసిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హకీమ్, పలువురు మైనార్టీ సోదరులు చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ షాదీముబాకర్, తులం బంగారం హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో హకీమ్, వజీత్, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న మాజీమంత్రి డా. చంద్రశేఖర్

ఝరాసంగం/కోహీర్/పెద్దశంకరంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో జైభీం, జైబాపు, సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంఆ ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, నాయకులు పాల్గొన్నారు. కోహీర్ మండలంలోని ఖానాపూర్, కొత్తూర్(కె), బడంపేట గ్రామాల్లో 'జై బాపూ జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామలింగారెడ్డి మాట్లాడారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి, మక్త లక్ష్మాపూర్, బూర్గుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు జైబీమ్ జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధుసూదన్ మాట్లాడారు.

## బీజేపీ, ఏబీవీపీ నాయకుల అరెస్ట్



సంగారెడ్డిలో పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/జహీరాబాద్/నిజాంపేట/ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం ఏబీవీపీ, బీజేపీ నాయకులు హెచ్‌సీయూ తరలివెళ్లకుండా పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. సంగారెడ్డి పట్టణ పోలీసులు ఇళ్లలోకి వెళ్లి ఆయా నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు ఆకాశ్, జిల్లా కన్వీనర్ రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్వారకరవి, నాగరాజు, రమేశ్, వాసు, తిరమలేష్, పవన్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. నారాయణఖేడ్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి, డివిజన్ నాయకులు మహేష్, బంటి, సతీష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి, ఖేడ్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాంలను ఎస్ఐ-2 మొగులయ్య ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. జహీరాబాద్ పట్టణంలో బీజెవైఎం నాయకులు సోమ అనిల్, నరేషపాటిల్, నిజాంపేటలో విద్యార్థి నాయకులు ప్రశాంత్, జగన్, నవీన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### విద్యార్థులపై లాఠీఛార్జి అమానుషం

జోగిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల అమ్మకానికి నిరసనగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయడం అమానుషమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

## మద్యం బార్‌కు నోటిఫికేషన్ విడుదల

మెదక్ అర్బన్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా మూతబడిన బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 2022 సంవత్సరంలో మూతపడ్డ బార్‌కు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం నోటిఫికేషన్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 26వ తేది సాయంత్రం 5 గంటల్లోపు తమ దరఖాస్తులను ఎక్సైజ్ సూపరిటెండెంట్, డీసీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన బాక్సులలో వేయాలన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారం, మూడు ఫోటోలు, రూ. లక్ష డీడీని కార్యాలయంలో అందజేయాలని సూచించారు. 29వ తేదిన జిల్లా కలెక్టర్ సమక్షంలో లటరీ పద్ధతి ద్వారా కేటాయిస్తామన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలపై గురువారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ నుంచి 26 తేదీ వరకు థియరీ, 26 నుంచి మే 3వ తేదీ వరకు జరిగే ప్రాక్టికల్స్ సజావుగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం పరీక్షా కేంద్రాలు, ఇతర విషయాలపై డీఈవో వెంకటేశ్వర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### (పిల్లల పట్లపై చూపాలి'

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ సూచించారు. సంగారెడ్డిలోని బాల సదనం, శిశు గృహ, సఖి, భరోసా కేంద్రాలను గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. పిల్లలందరూ క్రమశిక్షణగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.

### ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి


ఖేడ్‌లో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్/వట్‌పల్లి/అల్లాదుర్గం/తూప్రాన్/ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ శివారులోని డబుల్ బెడ్‌రూం గృహాల సమీపంలోని దొడ్డి కొమురయ్య చౌక్‌లోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పరశురాంరాథోడ్, రాజు, రవీందర్, కురుమ సంఘం బాధ్యులు మల్గొండ, అనిల్, బీమన్న, నవనాథ్, నర్సింహ, కురుమ సంఘం తాలుక అధ్యక్షుడు ప్రభాకర్ కురుమ దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రమైన వట్‌పల్లిలో దొడ్డి కొమురయ్య జయంతిని సంఘం మండలాధ్యక్షుడు సంగమేశ్వర్ ఆధ్వర్యంలో, అల్లాదుర్గం మండలంలోని ఐబీచౌరస్తా వద్ద కుర్మ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు గండి మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

### హరీశ్‌రావును కలిసిన ఆదర్శరెడ్డి

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భారాస పటాన్‌చెరు నియోజకవర్గానికి సమన్వయకర్త గా నియామకం పొందిన ఆదర్శరెడ్డి కార్పొరేటర్ సింధూతో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## సన్నబియ్యం నిరుపేదలకు వరం


పాపన్నపేటలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యం నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన పాపన్నపేటలో సన్నబియ్యం కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పాపన్నపేట మండలానికి సంబంధించిన 45 రేషన్ షాపులకుగానూ 15,556 రేషన్‌కార్డుల ద్వారా 50,102 కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయడం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన పాపన్నపేటలోని మంజీరా గార్డెన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 198 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలం కేంద్రంలోని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి సురేష్‌రెడ్డి, ఎంపీడీవో దామోదర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జంగరాయి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రోహిత్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, యాదారావు, సిద్ధిరాములు, సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

● కంగ్టి: మండలంలోని దెగుల్‌వాడి, చాప్టాకె, తడ్కల్, ముకుందానాయక్‌తండా తదితర గ్రామాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్‌రెడ్డి, తాజోద్దీన్ సన్నబియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● నాగల్‌గిద్ద: మండల పరిధిలోని ముక్తాపూర్‌లో గురువారం నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శివక్రిష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాణిక్యరావు, డీలర్ సంఘం మండల అధ్యక్షుడు సంగ్‌శెట్టి పటేల్, మాజీ ఎంపీటీసీ సంజీవ్‌పటేల్ పాల్గొన్నారు.

● చేగుంట: చేగుంట, నార్సింగి మండలాల్లో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి సన్నబియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి, అర్ఐలు పాల్గొన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

### పోటాపోటీగా కార్యక్రమాలు

మాసాయిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలో అధికారులు నిర్ణయించిన ప్రకారం కల్యాణలక్ష్మి చెక్కుల, సన్నబియ్యం పంపిణీ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి సమన్వయ లోపంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కార్యక్రమాల బహిష్కరణ వరకు వెళ్లింది. మండల కేంద్రమైన మాసాయిపేటలో ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీకి సునీతారెడ్డి హాజరుకాకపోవడంతో ఆవుల రాజిరెడ్డి తూప్రాన్ ఆర్డీవో, తహసీల్దార్ జ్ఞానజ్యోతితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిపక్షాల నియోజకవర్గాలను చిన్నచూపు చూస్తున్నారన్నారు.

### భూమి పూజ

శివ్వంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడెంలో గురువారం ఫ్లెమింగ్ లాబొరేటరీస్ ఎండీ ప్రకాష్ పరిశ్రమ సహకారంతో సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.



### రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలపై అమాయిత్యాలు పెరిగిపోయాయని శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం సాయంత్రం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమె మాట్లాడుతూ హోంశాఖ సీఎం చేతిలోనే ఉన్నా ఏనాడు రాష్ట్రంలో శాంతి భద్రతలపై సమీక్ష కూడా నిర్వహించలేదన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు సత్యంగౌడ్, సురారం నర్సింలు, మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

### పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కొండాపూర్/హత్నూర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు పేర్కొన్నారు. గురువారం దొబ్బకుంటలో డీటీ ప్రదీప్‌తో కలిసి రూ.12 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నర్సింహారెడ్డి, లక్ష్మీకిషన్, మాజీ సర్పంచ్ నర్సింహులు పాల్గొన్నారు. హత్నూర మండల పరిధిలోని ఆయా గ్రామాలకు లబ్ధిదారులకు మంజూరైన రూ.13.15 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మైనార్టీ సెల్ కార్యదర్శి ఎం.ఏ.హకీం, మండలాధ్యక్షుడు కర్రె కృష్ణ, దానంపల్లి సత్యం, లక్ష్మణ్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

### పదోన్నతి పొందిన టీచర్లకు శిక్షణ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పదోన్నతి పొందిన పీజీహెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు రెండురోజుల ఓరియంటేషన్ కార్యక్రమం సంగారెడ్డిలో గురువారం ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా ఎనిమిది కేంద్రాల్లో శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకుడు ప్రొ.మంగారెడ్డి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. డీఈవో వెంకటేశ్వర్లు కూడా శిక్షణ కేంద్రాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. కాగా జిల్లాలో 754 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో బాలయ్య, మాజీ ఏఎంవో అనురాధ, కో ఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

### యూడీఐడీ కార్డుల జారీపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో యూనిక్ డిజబిలిటీ ఐడీ కార్డు(యూడీఐడీ) జారీపై గురువారం సంబంధిత శాఖ అధికారులు, దివ్యాంగులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సదరం సర్టిఫికేట్ స్థానంలో దివ్యాంగులకు జారీచేసే యూడీఐడీ కార్డుల దరఖాస్తులు, సందేహాలు, సమాధానాలపై వివరించారు. ఆన్‌లైన్‌లో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, ఎదురయ్యే సమస్యలను డీఆర్‌డీఏ అధికారులు వివరించారు. ఈ సదస్సులో డీఆర్డీవో జ్యోతి, అడిషనల్ డీఆర్డీవో జంగారెడ్డి, డీడబ్ల్యూవో లలిత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### నీటి ట్యాంకర్ల సీజ్

రామచంద్రాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ శివారుల్లో అక్రమంగా నీటి దందాకు ఉపయోగిస్తున్న ఐదు నీటి ట్యాంకర్లను బుధవారం రాత్రి సీజ్ చేసినట్లు తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి తెలిపారు. ఆయా శివారుల్లో ప్రతి ఏడాది పెద్దపెద్ద గుంతలు తీసి, వాటిలో ప్లాస్టిక్ కవర్లు వేసి అందులో బోరు నీటిని నింపి నగరంలోని అపార్టుమెంట్లు, విల్లాలు, హోటల్స్‌కు సరఫరా చేస్తుంటారని తహసీల్దార్ తెలిపారు. ఈ దాడుల్లో ఆర్ఐ శ్రీకాంత్, కొల్లూరు ఎస్ఐ రమేశ్ తదితరులు ఉన్నారు.

### పేపర్ మిల్లులో అగ్నిప్రమాదం

జిన్నారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేపర్ మిల్లు పరిశ్రమలో అగ్నిప్రమాదం సంభవించగా.. ఫైరింజన్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. గుమ్మడిదల మండలం మంబాపూర్ పరిధిలోని తిరుమల ఆయిల్ ఇండియా (పేపర్ మిల్లు) పరిశ్రమలో గురువారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించగా.. గోదాంలోని పేపర్ బండిళ్లు దగ్ధమయ్యాయి.. సమాచారం అందుకున్న సమీప ప్రాంతాల ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశాయి. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉన్నది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

### నల్లవాగు గురుకులంలో ఆర్డీవో తనిఖీ

కల్హేర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తి గురువారం తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం తాజా కూరగాయలు, పప్పులతో కూడిన భోజనం, పండ్లు, గుడ్లు అందజేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన గురించి తెలుసుకుని విద్యార్థులకు పాఠశాలలో వైద్య సదుపాయం అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట సిర్గాపూర్ తహసీల్దార్ ఉమాశంకర్ ఉన్నారు.

### మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

- నార్కోటిక్స్ డీఎస్పీ పుష్పన్‌కుమార్

నర్సాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని నార్కోటిక్స్ డీఎస్పీ పుష్పన్‌కుమార్ అన్నారు. గురువారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాలు, వాటివల్ల దుష్ఫలితాలు 'అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సురేష్, వైస్‌ప్రిన్సిపాల్ సమీరా, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఇద్దరు అదృశ్యం


రుద్రయ్య, ఈశ్వరయ్య

సదాశివపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట మండలం మద్దికుంట, సదాశివపేట పట్టణం సిద్ధాపూర్ కాలనీలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మద్దికుంట గ్రామానికి చెందిన తలారి రుద్రయ్య(38) బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. దీంతో భార్య అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీకి చెందిన మంగళి ఈశ్వరయ్య(40) బుధవారం ఇంట్లోంచి వెళ్లి తిరిగిరాలేదు. ఈశ్వరయ్య భార్య మంగళి లక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ మహేస్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.